క్లుప్తంగా

చురుకుగా రోడ్డు నిర్మాణ పనులు

కంకిపాడు: మండలంలోని మారేడుమాక గ్రామంలో చేపట్టిన రోడ్డు నిర్మాణం పనులు చురుకుగా సాగుతున్నాయి. గ్రామం నుంచి మానికొండ రోడ్డుకు కలిపే డొంక రోడ్డును మెటల్ రోడ్డుగా అభివృద్ధి చేయటానికి మండల పరిషత్ సాధారణ నిధులు రూ.6.70 లక్షలతో రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. రోడ్డు నిర్మాణం పనులతో 2 కిలోమీటర్ల నిడివి తగ్గుతుంది. రోడ్డు పనులను గ్రామ సర్పంచి ఆదర్శకుమార్ గురువారం పరిశీలించారు. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి రాకపోకలకు వీలుగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తాడిగడపలో మా నమ్మకం నువ్వే జగనన్న

పెనమలూరు: తాడిగడపలో గురువారం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం 1 పరిధిలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నేతలు ఇంటింటికీ వెళ్లి జగనన్న అందించిన సేవల గురించి వివరించారు. నేడు ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు ఎటువంటి అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా అందిస్తోందని గ్రామస్తులకు వివరించారు. జగనన్నతోనే తమకు మేలు జరిగిందని లబ్ధిదారులు కూడా తెలిపారు. ఈ మేరకు సర్వే నిర్వహించి అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో కటికల క్రిస్టోఫర్, ఖాదర్‌బాషా, జిన్నా, నాగరాజు, ఎ.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పోరంకిలో 8 వేల మందికి అన్నసమారాధన

పెనమలూరు: పోరంకిలో గురువారం 8 వేల మంది భక్తులను అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి వారి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులను అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

గోసాలలో ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం

పెనమలూరు: గోసాల వైకుంఠపురంలో శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయ నిర్మాణానికి స్థానికుడు సాంబశివరావు గురువారం ఆర్థిక సాయం అందించాడు. గ్రామంలో శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ నిర్మాణం చేస్తోంది. ఆలయ నిర్మాణానికి కావల్సిన ఇటుకల కొనుగోలుకు దాత సాంబశివరావు రూ.21,500 ఆర్థికసాయం అందించారు. దాతలు సహకారంతో కనకదుర్గ అమ్మవారి ఆలయ నిర్మాణం పూర్తి చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

మరణానంతరం నేత్ర దానం



పెనమలూరు: గోసాల గ్రామంలో ఓ వ్యక్తి తన మరణానంతరం నేత్ర దానం చేశారు. గోసాల గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్ పోలవరపు రవి తండ్రి పోలవరపు రాజమన్నార్ (73) బుధవారం మృతి చెందారు. మరణించిన రాజమన్నార్ కోరిక మేరకు ఆయన నేత్రాలను గురువారం కుటుంబ సభ్యులు దానం చేశారు. ఎల్‌వి.ప్రసాద్ కంటి ఆస్పత్రి సిబ్బంది వచ్చి నేత్రాలు సేకరించారు. తన తండ్రి కోరిక మేరకే నేత్రాలు దానం చేశామని, మరొకరికి చూపు ప్రసాదించవచ్చనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామని మృతుడి కుమారులు పోలవరపు రవి, ముద్దుకృష్ణ, శ్రీనివాసరావు తెలిపారు.

10 గ్రామాలకు ఎంపీ కేశినేని వాటర్ ట్యాంకర్లు

కంచికచర్ల: వేసవికాలంలో గ్రామాల్లోని ప్రజలకు తాగునీటిని అందించేందుకు ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) వాటర్ ట్యాంకర్లను అందజేస్తున్నట్లు ఎంపీడీఓ కె.బాలశంకరరావు గురువారం తెలిపారు. ఈ ట్యాంకర్ల ద్వారా వీధుల్లోకి వెళ్లి ప్రజలకు తాగునీరు సరఫరా అయ్యేలా గ్రామ పంచాయితీ అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. మండలంలో 10 వాటర్ ట్యాంకర్ల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మండల కేంద్రమైన కంచికచర్లకు -2, మండలంలోని పరిటాల, చెవిటికల్లు, కునికెనపాడు, ఎస్.అమరవరం, వేములపల్లి, కీసర, గండేపల్లి, మోగులూరు గ్రామాలకు ఒక్కొక్కటి చొప్పున వాటర్ ట్యాంకర్లను అందజేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచులు ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీఓ తెలిపారు.

నేడు మండల పరిషత్ సమావేశం

కంచికచర్ల: కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 12వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ కె.బాలశంకరరావు గురువారం తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు పాల్గొంటారన్నారు. సమావేశంలో మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధి కోసం పలు అంశాలపై చర్చ జరుగుతుందని, అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు నివేదికలను తయారు చేసి సమావేశానికి విధిగా హాజరుకావాలన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరు కావాలని ఎంపీడీఓ తెలిపారు.

పొలిమేర వాగును పట్టించుకోరూ..

- ఇరువైపులా పెరిగిపోయిన ఆక్రమణలు
- ప్లాస్టిక్ వ్యర్థాలు, పిచ్చిమొక్కలతో పూడుకుపోయిన వైనం
- వాగు ప్రక్షాళన చేయాలని ప్రజల వినతి

గన్నవరం: మండలంలోని బుద్దవరం గ్రామ పంచాయతీ పరిధిలోని దావాజీగూడెం-అల్లాపురం గ్రామాల మధ్య ఉన్న పొలిమేర వాగు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. ఇప్పటికే వాగుకు ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోయి వాగు పూర్తిగా కుదించుకుపోయింది. దీనికితోడు గత కొన్నేళ్లుగా వాగులో పూడిక తీయకపోవడం కారణంగా ప్లాస్టిక్ వ్యర్థాలు, పిచ్చిమొక్కలతో నిండిపోయి నీటి పారుదల జరగడం లేదు. ఫలితంగా భారీ వర్షాలు కురిసిన ప్రతిసారీ వాగు పరిసర ప్రాంతాలు ముంపు బారిన పడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. పొలిమేర వాగు ప్రక్షాళన చేయాలని పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని పంచాయతీ అధికారులు

పూర్వం నుంచి రమణమ్మ చెరువులోని అధిక నీరు, రెండు గ్రామాల్లో మురుగు, వర్షం నీరు బయటకు వెళ్లేందుకు ఈ వాగు దోహదపడుతుంది. దావాజీగూడెంలోని శివాలయం నుంచి ఏలూరు కాలువ దిగువ వరకు ఉన్న ఈ వాగు నిర్వహణపై బుద్దవరం గ్రామ పంచాయతీ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. వాగు పరిరక్షణ చర్యలు తీసుకోకపోవడంతో పాటు గత మూడేళ్లుగా కనీసం పూడికలు కూడా తొలగించడం లేదు. దీంతో వాగు పూర్తిగా పూడుకుపోయి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పరిసరాల్లోని లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతోంది. నీటి పారుదల క్రమబద్ధీకరణకు సర్వే నిర్వహించి పొలిమేర వాగు సరిహద్దులను నిర్ణయించడంతో పాటు పూడికలు తొలగించాలని అల్లాపురం వాసులు కోరుతున్నారు. సదరు తమ విజ్ఞప్తులను బుద్దవరం ఈవో పట్టించుకోకుండా జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, లేనిపక్షంలో సమస్యను ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని అంటున్నారు.



వ్యర్థాలతో పూడుకుపోయిన పొలిమేర వాగు



పిచ్చిమొక్కలతో నిండిపోయిన వాగు

డ్రెయిన్ల అభివృద్ధికి చర్యలు

రామవరప్పాడు: గ్రామంలో అంతర్గత రహదారులు, డ్రెయిన్ల నిర్మాణానికి అధిక ప్రాముఖ్యం ఇస్తున్నామని ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు కేవీఆర్ కాలనీలో పంచాయతీ సాధారణ నిధులు రూ.5లక్షల నిధులతో డ్రెయిన్ నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా గ్రామంలోని ముఖ్య ప్రాంతాల్లో కూడా మౌలిక వసతులు కల్పించకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో మురుగునీరు సరఫరా లేక వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ సమస్యలను పరిష్కరించడానికి ఈ ప్రాంతంలో సాయి బాబా ఆలయం వద్ద నుంచి విన్సెంట్ నిలయం వరకు సీసీ డ్రెయిన్ నిర్మాణం చేయనున్నట్లు వివరించారు. గ్రామంలోని మిగిలిన ప్రాంతాల్లో కూడా ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోనేరు సుబ్బారావు, వార్డు సభ్యులు తుమ్మల కవిత, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎనికేపాడు కేవీఆర్ కాలనీలో డ్రెయిన్ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ పూర్ణచంద్రరావు

సైబర్ నేరాలపై అప్రమత్తం

చంద్ర దసాక



రామవరప్పాడు: నానాటికీ పెరిగిపోతున్న సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఇండస్ట్రీ కౌన్సిల్ ఆఫ్ కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా హెడ్ అకడమిక్, డెల్టా మార్చ్ కంపెనీ చీఫ్ స్ట్రాటజీ చంద్ర దసాక అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఐటీ, సీఎస్‌ఈ, సీఎస్ఎం, సీఎస్‌డీ విద్యార్థులకు కమ్యూనికేషన్స్ స్కిల్స్, ప్రాంగణ ఎంపికలను ఎలా ఎదుర్కోవాలి, సైబర్ నేరాల వంటి అంశాలపై అవగాహన పరిచారు. ప్రస్తుతం అనేక రకాలుగా హ్యాకర్లు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. నిమిషాల వ్యవధిలో హ్యాక్ చేసి తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని తెలిపారు. ఈ తరహా మోసాలతో వ్యక్తిగత డేటా అపహరించి బ్లాక్‌మెయిల్ చేయడం, అమాయకపు ప్రజల బ్యాంక్ అకౌంట్లను ఖాళీ చేయడం వంటివి చేస్తున్నారన్నారు. ఆగంతకులకు వ్యక్తిగత మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు ఇవ్వవద్దన్నారు. విద్యార్థులు ఈ మోసాలపై అవగాహన పెంచుకుని తోటి వారిని అప్రమత్తం చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు మాట్లాడుతూ ప్రాంగణ ఇంటర్వ్యూలలో ఎంపిక కావాలంటే ఉన్నత చదువుతో పాటు అంతర్గత నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. ఉన్నత ఉద్యోగాలిచ్చేందుకు కార్పొరేట్ సంస్థలు పోటీ పడుతున్నాయని వీటిని సాధించేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పలు విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవండి

ఎమ్మెల్యే పార్థసారథి

కంకిపాడు: సంక్షేమ ప్రభుత్వానికి అండదండలు అందించి బాసటగా నిలవాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఆయా కుంటబాలతో చేకూరిన లబ్ధితో రూపొందించిన సంక్షేమ బ్రోచర్‌ను పంపిణీ చేశారు. లబ్ధిదారులు రంగమ్మ, శ్రీనివాసరావు, లాజర్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత సంక్షేమ పథకాలతో తామెంతో సంతోషంగా జీవిస్తున్నామని హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందుతున్నాయన్నారు. వేల్పూరు గ్రామానికి గడచిన నాలుగున్నర సంవత్సరాలలో రూ.11.72 కోట్లు లబ్ధి జరిగిందన్నారు. 113 మందికి ఇళ్ల స్థలాలు అందాయని తెలిపారు. ప్రతి గడపకూ సంక్షేమాన్ని చేరువ చేసింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చెన్నుబోయిన శివనాగేంద్రమ్మ, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీబాబు, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, మాజీ సర్పంచి చెన్నుబోయిన జయరామ్, నేతలు చెన్నుబోయిన సుబ్బారావు, కొఠారి సాంబశివరావు, గోగుల మూడి నాగేశ్వరరావు, ములసయ్య తదితరులు పాల్గొన్నారు.



వేల్పూరులో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పార్థసారథి

రైతులకు పంట నష్టపరిహారం అందిస్తాం

కంకిపాడు: అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం అందిస్తామని జిల్లా వ్యవసాయాధికారి విజయ భారతి అన్నారు. ఆమె గురువారం కోలవెన్ను గ్రామాల్లో వర్షాలకు నష్టం జరిగిన పంటలను పొలాల్లో పర్యటించి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వటానికి సిద్ధంగా ఉందన్నారు. రైతులు వారికి జరిగిన పంట నష్టం వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. రైతులు తడిసిన పంటలను ఎండబెట్టాలని దీని ద్వారా తేమ శాతం తగ్గుతుందన్నారు. అధికారులు కూడా రైతుల పంట నష్టం క్షేత్ర స్థాయిలో పరిశీలించి వివరాలు సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.మాధురికిరణ్, వీఆర్వో సందీప్, వీఏఏ పవన్‌కల్యాణ్, రైతులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: వేసవి ఎండ తీవ్రత అధికం కావటంతో హనుమాన్‌జంక్షన్ కూడలిలో సత్యసాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక రామాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో పాదచారులు, ప్రయాణికులు, హనుమజ్జయంతి ఉత్సవాలకు వచ్చే భక్తులకు మజ్జిగ అందించారు. సుమారు 1400 మందికి ఉచితంగా మజ్జిగ పంపిణీ చేసినట్లు సమితి అధ్యక్షుడు బెక్కం వెంకటేశ్వరరావు తెలిపారు. సమితి సభ్యులు చలమలశెట్టి వెంకటేశ్వరరావు, సముద్రాల రాజాబాబు, నూకల బాలాజీ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):విజయవాడ రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కిన వ్యక్తి అదృశ్యం అయిన ఘటనపై జీఆర్‌పీ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజస్థాన్ రాష్ట్రంలోని జోద్‌పూర్‌కు చెందిన దేవరామ్ (36) కార్పెంటర్ పనుల కోసం 20 రోజుల క్రితం విజయవాడ వచ్చాడు. సిద్ధార్థ కళాశాల సమీపంలో సురేష్ అనే వ్యక్తి వద్ద పనికి చేరాడు. దేవరామ్‌కు మానసిక అనారోగ్య సమస్యలు తలెత్తడంతో యజమాని ఈ నెల 4న స్వస్థలం పంపించేందుకు విజయవాడ రైల్వే స్టేషన్‌కు తీసుకొచ్చి నవజీవన్ రైలు జనరల్ బోగీలో ఎక్కించి వెళ్లాడు. కానీ ఆయన ఇంటికి చేరలేదు. దీంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌లో కార్పెంటర్ పనిచేస్తున్న దేవరామ్ సోదరుడు ఓంప్రకాష్‌కు విషయం తెలిపారు. ఆయన విజయవాడ చేరుకుని పనిచేసిన చోట వివరాలు తెలుసుకున్నాడు. రాజస్థాన్ చేరుకుని వారి బంధువుల వద్ద విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బుధవారం రాత్రి విజయవాడ చేరుకుని జీఆర్‌పీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఎస్కార్ట్ పోలీసులు, లారీ ఓనర్ పరస్పర ఫిర్యాదులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఓ పెట్రోల్ బంకులో రెండ్రోజుల క్రితం ఎస్కార్ట్ పోలీసులు, లారీ ఓనర్ మధ్య జరిగిన గొడవపై హనుమాన్‌జంక్షన్ పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు అందజేశారు. వివరాల్లోకి వెళ్లితే.. స్థానిక విజయవాడ రోడ్డులోని హిందుస్థాన్ పెట్రోలియం బంకులో ఈ నెల 9వ తేదీన వీఐపీ ఎస్కార్ట్ వాహనంతో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ ఎస్ఐ ఇస్మాయిల్, కానిస్టేబుల్ సూర్యనారాయణ పాత తేదీలతో బిల్లులు ఇవ్వవలసిందిగా అక్కడి సిబ్బందిని అడిగారు. దీనికి బంకు సిబ్బంది కుదరదని చెప్పటంతో ఎస్కార్ట్ వాహనం పోలీసులు వారిపై ఒత్తిడి పెంచారు. ఇంతలో అక్కడే ఉన్న లారీ ఓనర్ పాలడుగు రామకృష్ణ వీరి మధ్యలో కలుగజేసుకుని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. బంకు సిబ్బందిపై ఎస్కార్ట్ పోలీసులు దురుసుగా వ్యవహరించటాన్ని లారీ ఓనర్ రామకృష్ణ అడ్డుకునే ప్రయత్నం చేశారు. విధుల్లో ఉన్న పోలీసులను చేతితో నెట్టడం మరింత తీవ్ర వివాదంగా మారింది. పెట్రోల్ బంకులో లారీ ఓనర్, ఎస్కార్ట్ పోలీసుల మధ్య జరిగిన వాగ్వాదం వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ నేపథ్యంలో ఈ ఘటనకు సంబంధించి ఇరువర్గాలు పరస్పరం హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు అందజేశారు.

జొన్న పంట పరిశీలించిన ఏడీఏ

గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాదలో గురువారం వ్యవసాయ శాఖ ఏడీఏ ఎం.సునీల్ పర్యటించి ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న జొన్న పంటను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు న్యాయం చేస్తామని చెప్పారు. జొన్న 33 శాతం కంటే ఎక్కువ నష్టం జరిగితే ఆ పంటను పంట నష్టం కింద నమోదు చేస్తామన్నారు. రైతులు గరిమెళ్ళ రాఘవరావు, షేక్ నవాబ్ జానీ, సయ్యద్ ఖాజా పంటలను, కల్లాలను పరిశీలించారు. ఎంఏవో ఎస్ఎల్ తేజశ్వి, వీఏఏలు లక్ష్మణరావు, ఎస్తేరు పాల్గొన్నారు.



ముస్తాబాదలో జొన్న పంట పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ సునీల్, ఎంఏవో తేజశ్వి

విజ్ఞాన సాధనకు పుస్తక పఠనం ఉత్తమం

గన్నవరంరూరల్: విజ్ఞాన సాధనకు పుస్తక పఠనం ఉత్తమ మార్గమని జెడ్పీటీసీ సభ్యురాలు ఎ.ఎలిజబెత్ రాణి చెప్పారు. మండలంలోని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయాన్ని గురువారం ఆయన సందర్శించి ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం, జ్ఞాన సాధనకు ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరంలో పోస్టర్ ఆవిష్కరించారు. శిక్షణ శిబిరంలో విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలు వెల్లడవుతాయని, మనో వికాసం కలుగుతుందని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లోని గ్రంథాలయాల్లో రోజువారీ కార్యక్రమాల నిర్వహణతో బాలల్లో అంతర్లీనంగా ఉన్న ప్రతిభా శక్తులు వెలికితీసేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి పొట్లూరి వెంకట మురళీ కృష్ణ, లైబ్రేరియన్ కె.కృపానందం, కొడాలి శ్రీనివాసరావు, ఎ.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. గ్రామస్తులు, పాఠకులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరించిన జెడ్పీటీసీ ఎలిజబెత్ రాణి, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ

అభయాంజనేయస్వామికి విశేష పూజలు



కూచిపూడి నృత్య ప్రదర్శన

- ప్రత్యేక అలంకరణలో ఆకట్టుకున్న హనుమాన్
- 1008 చామంతి, బంగారు, వెండి పుష్పాలతో అర్చన
- ఆధ్యాత్మిక వేదికపై భక్తి గీతాలు, అన్నమయ్య సంకీర్తనలు
- అలరించిన కూచిపూడి నృత్యప్రదర్శన, మిమిక్రీ షో



అభయాంజనేయ స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాల మూడో రోజైన గురువారం విశేష పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామి వారికి సుప్రభాత సేవ, అర్చన జరిగాయి. దేవస్థానాన్ని రకరకాల పూలతోనూ, అభయాంజనేయ స్వామిని నిలువెత్తు గులాబీపూల దండ, తమలపాకుల మాలతోనూ ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన అర్చకుడు మారేపల్లి సీతారామానుజాచార్యులు, అర్చకులు గొట్టిపాళ్ల శ్రీనివాసాచార్యులు, శృంగారం వెంకట శేషారామాచార్యులు అంజనీపుత్రునికి 1008 చామంతి పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక వేదికపై రాధాకృష్ణ భజన మండలి (కొయ్యూరు) ఆధ్వర్యంలో భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం పసలపూడి మాచిరాజు (రాజమహేంద్రవరం) ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు భక్తులను తన్మయత్వానికి గురిచేశాయి. సాయంత్రం హనుమంతునికి బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ప్రముఖ నాట్యాచార్యుడు అడుసుమిల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శిష్యబృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. మహిళా నాట్య కళాకారులు సంప్రదాయ నృత్యాలు, విన్యాసాలు కనుల విందు చేశాయి. అంతర్జాతీయ మిమిక్రీ ఆర్టిస్ట్ తోట సిల్వెస్టర్ నిర్వహించిన ప్రదర్శన ఎంతగానో అలరించింది. హాస్యభరితంగా సాగిన మాట్లాడే బొమ్మ షో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

నేటి ఉత్సవాల్లో గరికపాటి ప్రవచనం

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా 12వ తేదీన పద్మశ్రీ గరికపాటి నరసింహారావుచే ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నట్లు అభయాంజనేయ స్వామి దేవస్థానం పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం గురువారం తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ఆధ్యాత్మిక వేదికపై గరికపాటి ప్రవచనం ప్రారంభమవుతుందని చెప్పారు. అధికసంఖ్యలో భక్తులు హాజరై ఈ ప్రవచన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

కాకాని ఆశయాలను నేటి తరానికి తెలియజేయాలి

కాకాని ఆశయ సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకాని

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్వాతంత్ర్య సమర యోధుడు, జై ఆంధ్రా ఉద్యమ మార్గదర్శకుడు కాకాని వెంకటరత్నం ఆశయాలను నేటి తరానికి తెలియచేయాలని, అందుకు స్వాతంత్ర్య సమర యోధుల సంఘం ముందుకు రావాలని కాకాని ఆశయ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకాని కోరారు. ఈ మేరకు ఆయన విజయవాడలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో స్వాతంత్ర్య సమర యోధుల సంఘం ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షులు కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, సభ్యుడు సాంబశివరావుకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ తరుణ్ కాకాని మాట్లాడుతూ వైజాగ్ ఉక్కు కర్మాగారాన్ని ఏపీలో ఏర్పాటు చేసేందుకు పోరాడిన వెంకటరత్నంను ఉక్కు కాకానిగా పిలిచేవారని గుర్తు చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడిగానే కాకుండా రాజకీయవేత్తగా నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఉమ్మడి ఏపీలో వ్యవసాయ, పాడి పరిశ్రమ శాఖ మంత్రిగా పనిచేశారని తెలిపారు. గతంలో కాకాని సర్కిల్‌గా పిలిచే బెంజిసర్కిల్‌లో ఉన్న కాకాని వెంకటరత్నం విగ్రహాన్ని అక్కడ ఫ్లైఓవర్ నిర్మాణ సమయంలో ఎన్‌హెచ్ఎఐ తొలగించిందని, అందుకు పలువురు రాజకీయ నాయకులు నిరసనకు దిగారని చెప్పారు. తమ సమితి తరుపున అనేక మంది అధికారులు, రాష్ట్ర గవర్నర్, అన్ని ప్రధాన రాజకీయ పార్టీల నాయకులకు వినతులు సమర్పించామని పేర్కొన్నారు. కాకాని వెంకటరత్నం స్మారక విగ్రహాన్ని అదే స్థలంలో పునరుద్ధరించడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మోతుకూరి వెంకటేశ్వరరావు, సర్వోదయ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ మోహన్ ప్రసాద్, సాంబశివరావు మాట్లాడుతూ బెంజి సర్కిల్‌లో కాకాని వెంకటరత్నం విగ్రహాన్ని పునరుద్ధరించడంతోపాటు సర్కిల్‌కు కాకాని సర్కిల్‌గా నామకరణం చేయించేందుకు తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. ఈ విషయంలో కాకాని ఆశయ సాధన సమితి చేపట్టే అన్ని కార్యక్రమాలకు తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు.



వెంకటేశ్వరరావు, సాంబశివరావులకు వినతి పత్రం అందజేస్తున్న తరుణ్ కాకాని

వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తేవాలి

వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కార్మిక, కర్షక, పేదల పక్షపాతి అని, ఆయన ప్రభుత్వాన్ని తిరిగి మరోసారి అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి కార్మికుడిపై ఉందని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. వైఎస్సార్‌టీయూసీ ముఖ్య నేతల సమావేశం గౌతంరెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం పూర్తిగా కార్మిక, కర్షక, పేదల పక్షాన నిలబడి వారి సంక్షేమం అభివృద్ధి కోసం పాటుపడుతోందని చెప్పారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్నారన్నారు. కార్మికులంతా ఐక్యంగా ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.

వేసవి శిక్షణ శిబిరాలతో విజ్ఞానం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టీజే పూర్ణమ్మ

సత్యనారాయణపురం(విజయవాడ పశ్చిమ):గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవాలని ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టీజే పూర్ణమ్మ పేర్కొన్నారు. గురువారం సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో వేసవి శిబిరాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. శిబిరం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయస్సు నుంచే పాఠశాలలో పాఠ్యపుస్తకాలతో పాటుగా గ్రంథాలయాలకు వెళ్లి నీతి కథలు, జాతీయ నాయకుల చరిత్రలు, మన సంస్కృతికి సంబంధించిన గ్రంథాలు వంటి విలువైన పుస్తకాలను పఠనం చేయడంతో సామాజిక స్పృహ కలుగుతుందన్నారు. ఈ శిక్షణ శిబిరంలో స్పోకెన్ ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్, తెలుగు శ్లోకాలు, యోగా, ధ్యానం, మేథమెటిక్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలను తప్పనిసరిగా గ్రంథాలయాలకు పంపించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో నీతి కథలు చెప్పించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. గ్రంథాలయ అధికారి పి.సంపత్‌కుమార్, ఆర్.శ్రీనివాసులు, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.